# పంచాక్షరి

కోటిఫలిరేవు కోటిదీపాల కాంతితో జజ్వాలమానంగా వెలిగిపోతున్నది. గోదావరి మహానది గట్టునిండా దీపాలు. అరటాకు దొప్పల్లో దీపాలు పసుపు ఎరుపు రంగుల కలగాపులగంగా నదినీటినిండా ప్రతిఫలిస్తూ గౌతమిని అర్చిష్మతిని చేస్తున్నాయి. ఎక్కడ చూసినా పరిమళం. గోదావరి అంతా వెన్నెల ప్రవహిస్తున్నట్లుగా ఉంది. కిందా పైనా అటూ ఇటూ దూరంగా దగ్గరగా అంతా వెన్నెల, వెన్నెల. పదహారు కళలూ నిండి, పండి లోకానికంతా తానే రాజునంటున్నాడు చంద్రుడు ఆ తల్లి గిరిరాజకన్య నావల్లనే రాజరాజేశ్వరి అయింది, పరమశివుడు రాజశేఖరుడూ అయినాడు అని ఆనందంతో శశి పరవశించి పోతున్నాడు ఆకాశంలో.

ఆనాడు కార్తీకపూర్ణిమ. తూర్పుదిక్కు అనే పెద్ద తెల్ల చామంతి పూవు మధ్య దుద్దులాగా ఉన్నాడు చంద్రుడు. అవతలిగట్టున రెల్లుపూలు దట్టంగా తలలూపుతున్నాయి. వెన్నెలపూత పూసిన గట్లమధ్య వెండినీరు ప్రవహిస్తున్నట్లుగా ఉంది రేవు. అటూ ఇటూ దీపాలు ఒడ్డుకు పసిడిపూత పూస్తున్నాయి. తల్లీతండ్రీ తమ పనుల్లో మునిగిపోయి ఉండగా ఆడుకోవడానికి బయటపడ్డ అల్లరి వినాయకుడిలాగా గట్టునున్న పట్టపుటేనుగు మధ్య మధ్య కేరింతలు అనే ఘీంకారాలు చేస్తున్నది. మావటీడు దగ్గరకు రాకుండా ప్రజలను నివారిస్తూనేవున్నా చిన్నాపెద్దా ఆ అంబారీ అలంకృతమైన పట్టపుటేనుగు దగ్గరకు చేరి దానికి వెలగపండ్లూ చెరకుగడలూ అందించాలని సంబరపడుతున్నారు ఆరగింపు చేయాలని తహతహ లాడుతున్నారు.

'సువాసిన్యర్చనప్రీతా కామాక్షీ కామదాయినీ' అని శ్రుతిలాగా అమ్మవారి స్తుతిశ్రుతి మనోహరంగా కోవెలలోనుంచి బృందగీతిగా వెడలి అది విని పారవశ్యంతో అలలు తలవూచేలా, జ్యోతిర్లతలు ఆనందంతో నర్తిస్తున్నట్లు స్పష్టంగా గంభీరంగా ఎంతో దూరానికి కూడా వినపడు తోంది.

నూటఎనిమిది మంది పురుషులు మరో నూటఎనిమిది మంది స్త్రీలు అమ్మవారి సహస్ర నామార్చనం చేస్తున్నారు మంద్రగంభీర స్వర మహితంగా. ఆ తల్లి రాజరాజేశ్వరి. వాళ్ళు దంపతి పూజగా ఆ సహస్ర నామార్చనను నిర్వహిస్తున్నారు.

ఆ సన్నిధిలో అల్లంత దూరాన నిలిచి మహారాణి అమ్మంగ దేవి నిలువెల్లా పులకరించి పోతూవుంది.

ఆ రోజున అమ్మవారికి తీర్చిదిద్దిన కల్యాణ తిలకంగా ఉంది ఆ మహారాణి సొగసు. దోసవిత్తులాగా తీర్చిదిద్దారు అమ్మవారి తిలకం ఆ రోజు. ఆమె పాదాలేకదా నా జన్మ సాఫల్యానికి మెట్టు, పట్టు అని రాణి మనసు విముగ్ధమైపోతున్నది.

'శోభనా శుద్ధమానసా' అని రాజపత్ని కూడా పెదాలు కలుపు తున్నది బృందగీతితో అప్పుడప్పుడు.

'రాజత్కృపా, రాజపీఠ నివేశితనిజాశ్రితా, రాజరాజార్చితా, రాజ్ఞీ, రమ్యా, రాజీవలోచనా' అన్న స్తుతి వింటూవుంటే అంతా రాజ రికమేకదా ఆ తల్లిది అనుకొంటున్నది అమ్మంగదేవి.

రాజరాజు ఎంతో హుందాగా తన ఇల్లాలివైపు చూశాడు. నిండు సరిగచీరలో మొగలి పువ్వులా ఉన్నదామె ఆయన విలో కనాలకు.

'రాజరాజేశ్వరీ, రాజ్యదాయినీ'

అమ్మంగదేవి రెండు కళ్ళూ బంగారు ప్రమిదెలలో వెలిగించిన ఆవునేతి దీపాలలాగా ఉన్నాయి. అల్లంతదూరాన బంగారు పూలు తాపిన వెండిపీటపై దీపశిఖలా అధివసించి ఉన్నారు నన్నయ భట్టార కులవారు.

ఇల్లాలివైపూ నన్నయ్యగారి వైపూ మార్చి మార్చి చూస్తున్నాడు రాజరాజు. సంతోషాతిశయం కలిగినా దుఃఖాతిరేకం కలిగినా మనస్సుని ఒక్కచోట నిలపటం కష్టం. తాను ఇన్నాళ్ళూ పడిన కష్టాలన్నీ ఒక్కటొక్కటే గుర్తు వచ్చాయి రాజరాజుకి.

తన తమ్ముడు, చిన్నతనాన తనతోపాటు కష్టాలన్నీ పంచుకున్నవాడు అధర్మంగా అన్యాయంగా రాష్ట్ర విప్లవానికి అలజడికి కారకుడైనాడు. ఎన్నో కుట్రలతో తనని విసిగించాడు. అతణ్ణి పూర్తిగా తాను లొంగదీసుకోవటానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది. అటు రాష్ట్రకూటులు, ఇటు గాంగ కాళింగులు, వీళ్ళు చాలక వైదుంబులు తన రాజ్యానికి చాలా అలజడి కలిగించారు. కాని ఇప్పుడు తన నెవరూ తేరి చూడలేరు. ఇదంతా నన్నయ్య భట్టారకుల వారి చలవ. నన్నయ గారు తేజస్వి. అగ్నిసమానులు. ఆయన వైపు ఎవరూ తల ఎత్తలేరు. ఆయన అగ్నిభట్టారకులే. ఆయన ఆశీస్సులవల్లనే తాను రాజ్య పరిపాలనలో స్థిరంగా నిలదొక్కుకోగలిగాడు. తనకు పదితరాలవరకూ వెనక్కు చూసుకుంటే ఏముంది? అన్నీ అంతఃకలహాలు. అన్నదమ్ముల వైరాలు. అసూయలు. మత్సరాలు. అన్నదమ్ముల ప్రాణాంతక కలహాలు. అన్నదమ్ముల అసూయవల్ల ఏమవుతుంది? మహాభారతంలో ఏమైంది? సర్వం దగ్ధం.

కృష్ణాగోదావరుల మధ్య వేగిదేశాన్ని నిరంతరం మంటలమధ్య వేగిపోయిన దేశమని చోళులు రాష్ట్రకూటులు గాంగులు పరిహాసం చేస్తున్నారుట. ఈసడించుకుంటున్నారుట. దగ్ధ రాష్ట్రమని నవ్వుకుంటు

న్నారుట. నన్నయ్యగారివంటి విదగ్ధుల అండ తనకు దొరకబట్టి కదా పన్నెండు తరాలనుంచీ అతలకుతలమైపోతున్న వేంగీదేశాన్ని, ఈ వేగి దేశానికి నాయకమణి అయిన రాజమహేంద్రవరపట్టణాన్ని తాను అల జడులు ఏమీ లేకుండా శాంతంగా సర్వాయత్తం చేసుకుని పరిపాలిస్తు న్నాడు! తన వెనుకటి కాలంలో పన్నెండు తరాల రాజు లెవ్వరూ పట్టుమని పాతికేళ్ళుకూడా రాజ్యం చేయలేదు. నూరేళ్ళకిందట తన తాత రాజమహేంద్రుడు గోదావరీ తీరానికి తన రాజధాని మార్చు కున్నాడు. ఈ నూరేళ్ళలో ఎంత సంక్షోభం. ఎన్ని యుద్ధాలు. పదీ, రెండు తరాలు మారిపోయాయి. తన తాతగారు రాజరాజ చోళ చక్ర వర్తి, మేనమామ రాజేంద్రుడూ తన కెంతో సహాయం చేశారు. చెయ్యరా మరీ, ఆడపిల్ల నిచ్చుకున్న తర్వాత! అన్నిటికన్నా తన జీవితానికి గొప్ప సహాయం, రక్షణ నన్నయ్యగారు. ఆయన పరమశివాచార్యులు. తనకు తండ్రి కరవైనప్పటినుంచీ నన్నయ్యగారి అండదండలే తండ్రిని మరపింపజేస్తున్నాయి.

మధ్య మధ్య తానూ ఓ నామం అందుకుంటూ వింటూ అంటూ ఉన్నా రాజరాజనరేంద్రుడికి మనసు నిబ్బరంగా నిలకడగా లేదు. అటువైపు చూపు ప్రసరించగానే అమ్మంగదేవి అందమంతా కొట్టి వచ్చినట్లు ప్రశాంత గంభీరంగా ఆమె ఒక మంచి గంధపు పూత బొమ్మలాగూ కనిపిస్తూ మనస్సుని ఆకర్షిస్తూ ఉంది. కిన్నెర కంఠంతో ఆమె దేవీనామాలు చెపుతున్నది మధ్య మధ్య తన గొంతునీ బృంద గానానికి జతచేస్తూ. నారాయణభట్టుగారూ విజయాదిత్యుడూ దక్ష వాటికలో నిలిచిపోయారు భీమనాథుణ్ణి అర్చించే నిమిత్తం. ఇదివరలో తన తమ్ముడు విజయాదిత్యుడు శత్రువులతో చేరిపోవడం అదొక పీడకల తనకు.

నన్నయ్యగారు పూజ ముగించినట్లున్నది-తన ఇల్లాలికి కుంకుమ ఇచ్చారు. తనను చిరునవ్వుతో చూస్తూ బిల్వం అందించారు. ఆలయ మండపంలోంచి నాదస్వరం మనోహరంగా వినవస్తూన్నది.

అక్కడినుంచి వాళ్ళు శివాలయంలో అభిషేక స్థలి దగ్గరకు కదిలారు. వెండికొండలా ఉన్నారు నన్నయ్యగారు ఆయన్ను చూస్తున్నంతసేపూ తనకు అభయహస్తం లభించినట్లే ఉంటుంది. మనసులో ఏదో సత్వస్థితి, ప్రశాంతత ఆవహిస్తాయి.

రుద్రం ఏకాదశ ఆవృత్తి కూడా ముగిసిందిలా ఉంది అప్పుడే. రాజరాజనరేంద్రుడు అత్యంత ఆశ్చర్యచకితుడై చూశాడు. అమ్మంగదేవి శివస్తోత్రం చేస్తూ ఉంది. షష్ఠి ఘడియలూ రాజ్యతంత్రంలోనే మునిగి తేలుతూ ఆమె ఆటపాటలు ముద్దు ముచ్చట్లు సంగీత సాహిత్యాలు ఇన్నాళ్లూ తాను గమనించలేక పోయినాడు. పట్టించుకోలేకపోయినాడు. శ్రుతిమనోహరమైన కంఠం తన రాణిది. శైశవం నుంచీ తనకు తెలుసు. ఆమె తన మేనమామ కూతురేగదా! తెలియకపోవటానికి ఆస్కారమేముంది? నాయనారుల స్తోత్రాలన్నీ ఆమె నోటికివచ్చు. కౌమారదశలో తాను తంజనగరంలో మేనమామ ప్రాపకంలో ఉన్నప్పుడు ఎప్పుడు విన్నాడో ఆమె మధురకంఠం. ఆమె కాపరానికి వచ్చిన తర్వాత అన్నీ మరిచిపోవాల్సి వచ్చింది.

అమ్మంగదేవి శంఖసుందరగళ. శంఖధ్వానంగా భక్తి జాలు వారుతున్నట్లు ఆమె శ్రావ్యంగా పలుకుతూంది ఒక్కొక్క పదమే.

"వరద సురాసురవందిత కరుణాకర హర పినాకకర కరి చర్మాంబర శంకరగిరిజా సుందర.... శ్రీ కంఠ లోకేశలోకోద్భవస్థాన సంహారకారీ మురారిప్రియా చంద్రధారీ మహేంద్రాది బృందారకానంద సందోహ సంధాయి పుణ్యస్వరూపా దక్షాధ్వరధ్వంస దేవ నీదైన తత్త్వంబు బుద్ధిం ప్రధానంబు కర్మంబు విజ్ఞానయోగంబు సర్వ క్రియాకారణంబంచు భావింతురీశా... నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు కారుణ్యమూర్తీ త్రిలోకైకనాథా నమస్తే నమస్తే నమస్తే నమః!"

రాజరాజు ఆనంద పారవశ్యంతో ఉక్కిరి బిక్కిరై తల మున్కలై పోతున్నాడు. ఆమెను హృదయంలో గాఢంగా గుచ్చి కౌగలించుకొని హృదయ పీఠరాజ్ఞిని చేసి వింజామరలు వీస్తున్నాడు.

నన్నయ్యగారి వదన చంద్రమండలం నుంచి అమృతస్నిగ్ధమయమైన హాసరోచుల పెదవులమీద నందివర్ధనాలు పూచి పక్కున నవ్వుతున్నట్లనిపిస్తున్నాయి.

నా బిడ్డ నా తల్లి అని ప్రేమపూరితంగా ఆమెను మెచ్చుకుంటున్నట్లున్నాయి ఆయన చూపులు.

రాజరాజుకి మనసుండబట్టటంలేదు. ఈమె ఇన్ని ఎక్కడ నేర్చింది. ఎవరు నేర్పారు. పదేళ్ళకిందట ఆమె కాపరానికి వచ్చినా స్థిమితంగా ఆమె పాట వినటంకానీ ఆమెతోకలిసి ఏదైనా పుణ్య క్షేత్రానికి వెళ్ళటంకానీ తన కింతవరకూ తీరని కోరికలుగానే ఉండిపోయాయి. దక్షిణదేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ చూసి రావాలంటుంది తన దేవేరి. ఏదీ తనకు తీరిక?

తన ముత్తాత ఒకరు ఎనిమిదేళ్ళు రాజ్యంచేసి నూరు యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఇంకో తాత నిరవద్యపురం యుద్ధంలో పద్దెనిమిదేళ్ళ వయసున అభిమన్య కుమారుడిలా వీర స్వర్గం చూరగొన్నారు. అంతా బంధువులే. అన్నదమ్ముల తరతరాల సంతానమే. అయితేనేం, ఎడతెగని రాష్ట్ర విప్లవాలు. జైనులు, బౌద్ధులు, వైదిక మతాభిమానుల, శైవుల కలహాలు. గ్రామాలకు గ్రామాలే పరశురామప్రీతి కావటం. మత దురభిమానంతో కుప్పలు కుప్పలుగా వేసి గ్రంథాలు తగలపెట్టడం- తన మనసంతా కలచివేస్తున్నది.

తన తండ్రులు రాష్ట్రకూటులు తరిమివేశారు. కర్ణాటకచాళుక్యలకు వేగిచాళుక్యులంటే కన్నెర్ర, చోళులతో పొత్తు కలుపుకున్నారని. తన తండ్రి విమలాదిత్యుడు, పెదతండ్రి శక్తివర్మ మహారాజు చోళ

దేశానికి వలసపోయి కావేరి ఒడ్డున తిరువాయూరులో తలదాచుకోవలసి వచ్చింది. చోళ చక్రవర్తి రాజాధిరాజు తన తండ్రి అయిన విమలాదిత్యుడికి బిడ్డనిచ్చి పెళ్ళి చేయకపోతే తాను ఈ వేగిదేశానికి రాజు కాగలిగేవాడా?

తన చిన్నతనమంతా తాతగారి దగ్గర తంజావూరులోనే గడిచింది. తమ తాతలు దారుణంగా కలహించుకున్నారు. పినతాతగారు రాజ్యానికి వచ్చారని తాతగారు పగపట్టి పాతిక సంవత్సరాలు హోరాహోరీ పోరాడి పినతాతగారిని చంపి తాతగారు రాజ్యానికి వచ్చారు. అయితే ఏమైంది? మూడేళ్ళు కూడా ఆయన రాజ్యం చెయ్యలేదు.

పొత్తపినాడులో ప్రోలనాడులో రేనాడులో మతకలహాలు మాన్పలేక పది సంవత్సరాలనుంచీ సామ దాన భేద దండోపాయాలతో తలమున్కలవుతున్నాడు తాను. నన్నయ్యగారి సాయం లేకపోతే తనకీ జవ సత్వాలు కలిగి ఉండేవికావు. తండ్రిగారు ఒకవిధంగా తప్పుతోవ తొక్కారు. ఆయన జైనమతాన్ని అభిమానించి ఉండవలసిందికాదు. జైనమతాన్ని అభిమానించి జైన వసతులు కట్టించి ప్రోత్సాహం చేశారు. అమ్మకి ఇష్టం ఉండేదికాదు. అమ్మకి తిరువెంబావు అంతా నిత్యపారాయణం. తన తాతలలో ఒకరు నూట ఎనిమిది శివాలయాలు నిర్మించారు.

అప్పుడప్పుడే తను రాజ్యానికి వచ్చి పన్నెండేళ్ళు కాలగమనంలో కలిసిపోయాయి. ఏం చేశాడు తాను; ఏం చేయగలడు? మహాకాలుని విలయతాండవానికి తెలుగునేల రంగస్థలం ఇన్నాళ్ళూ. ధరణికోట, ఎనమదల, చందోలు భగభగమంటలతో కాలిపోయినాయి. తన పెదతండ్రి శక్తివర్మకి చాళుక్యచంద్రుడనే బిరుదుండేది. ఆయన ఏమీ చేయలేకపోయినాడు. పైపెచ్చు తనతండ్రి జైనధర్మాన్ని అవలంబించాడు. పౌరుషంలేని జాతి జ్ఞానకీర్తులు సంపాదించలేదు. తమ మతం విలుప్తధర్మమైపోతున్నది. ఏనాటికైనా నన్నయ భట్టారకుల వారిపైనే తన ఆశ. ఆయన సత్వసంపన్నుడు, ధీరుడు, ధర్మాధర్మ

విశారదుడు, బహుశ్రుతుడు, సమచిత్తుడు అని అనుకుంటూ నన్నయ్య గారివైపు చూశాడు రాజరాజు.

అమ్మంగదేవితో ఆయన ఏమిటో చెపుతున్నారు. పంచాహ్నిక దీక్ష ఉన్నదట. తనను కూడా అర్థించి చూడవలసిందిగా కాబోలు! అమ్మంగదేవి తనవద్దకే వస్తున్నది. కాలకాలా, కృపాంభోనిధీ - తన మనసులో చిరకాలంగా గుప్తంగా ఉన్న వాంఛ నెరవేరేనా? ఎందుకు నెరవేరదు? వాణీరమణీశ్రిత వదన సరోరుహులు నన్నయ భట్టారకుల వారు. వారివల్లనే ఆ కోరిక నెరవేరాలి.

ఇంతలో మహాదళవాయి పట్టిసాచలయ్యగారు వచ్చి, పట్టపు ఏనుగు ముఖమంటపం దగ్గర సిద్ధంగా ఉంది, దేవేరితో బయలు దేరండి మహారాజా అని మనవి చేస్తున్నాడు. మళ్ళీ నన్నయ్యగారి దర్శనం ఎప్పుడో తనకు? మహాదేవుని సమక్షంలో ఇవాళ ఇప్పుడు ఇక్కడ ఆయన్ను సేవించుకొని అవుననిపించుకోవాలి.

ఇల్లాలు తన దగ్గరగా వచ్చింది. దేవాలయ ఆవరణమంతా అఖండ శోభతో వెలిగిపోతున్నది. దివ్యోజ్జ్వల దీపకాంతులు. నాద తనుడైన శంకరుణ్ణి నాదమనే తేనెతో అభిషేకం చేస్తున్నట్లు దేవాలయ మంతా మధుర నాద పరిమళభరితమైపోయింది. ఈ నాద స్వరవిద్వాంసు లను గొప్పగా సత్కరించాలి అనుకున్నాడు రాజరాజు. ఆలయ ఆవర ణలో సంపెంగ చెట్లు విరగపూసి ఉన్నాయి. కర్ణికార పుష్పాలు, పొగడ పూలు ఆవరణాన్ని అంతా సుగంధ విచికిలం చేస్తున్నాయి. ధ్వజ స్తంభాని కల్లంత దూరంలో ఉన్న ఒక సంపెంగ మానుదగ్గరకు నడి చాడు రాజరాజు. అమ్మంగదేవిన్నీ ఆయన్ను అనుసరించి దగ్గరగా వచ్చింది. వేదపండితులు దోసిళ్ళొగ్గి నన్నయ్యగారితో ఏదో విన్నవించు కుంటున్నట్లున్నది. మంచి అవకాశం దొరికింది.

"చోళసుందరీ! ఇంత తెలుగెప్పుడు నేర్చుకున్నావు? ఇందాక నీవు మహాదేవుణ్ణి స్తోత్రం చేస్తుంటే నాకేమనిపించిందో తెలుసా! నీవే హైమవతివనిపించింది. నీవే అఖిలాండేశ్వరివి. సుగంధికుంతలాంబవు. కోమలవల్లివి. మంగళాంబికవు. జ్ఞాన సంవర్ధినివి."

"చాలించండి మీ దేవీస్తోత్రం. ఇది ఏకాంతంకాదు. దేవాలయం." ముసిముసి నవ్వుల మొల్లలు కురిపిస్తూ ముక్కుమీద వేలుంచుకుంది అమ్మంగదేవి.

"నువ్వేమో విద్యాధర సుందరిలాగా, గంధర్వాంగన లాగా గానం చేశావే. ఎప్పుడు నేర్చావంటే చెప్పవేం? తెనుగు మీరిపోయినావే చాలా" అని మురిపెపు చూపులు చూశాడు రాజరాజు.

"ఏం నాకు తెలుగు రాదనుకొన్నారా? తెలివిలేదనుకొన్నారా?"

"తంజపురంలో నేను నిన్నెరుగనా? 'ఈశనడిపోట్రి ఎందయ డిపోట్రి దేశివడిపోట్రి. శివన్ శేవడిపోట్రి నేయత్తే నిన్రనిమలివ్ అడి పోట్రి....'(రక్షకుని శ్రీపాదములకు వినతి, జగత్పిత పాదపద్మములకు నమస్కారము, జ్యోతి స్వరూపా! నీ శ్రీపాదములే గతి, అరుణారుణ పదకమలా నీ పాదములకు నమస్కారము, భక్తులయొక్క ప్రేమ వీక్షణములందు నిల్చు సౌభాగ్య పాదపద్మములకు మ్రొక్కులు) అనే తేవారమేకదా నీకు అహరహం మననం. మణివాచకులే మీ ఇంటిల్లిపాదికీ ఇష్టం" అని వేళాకోళం చేశాడు రాజరాజు.

అమ్మంగదేవి ముగ్ధ మనోహరంగా నవ్వింది.

"పోనీలెండి. నాకోసం తమిళం నేర్చుకున్నారు. నాకు తెలుగు రాదని మీకెవరు చెప్పారు?! తంజావూరులో మీ రాజమహేంద్రవరంలోకన్నా గొప్ప తెలుగు విద్వాంసులున్నారు మీకు - తెలుసా? ఇంతకూ మా అత్త ఎప్పుడైతే తెలుగు కోడలైందో అప్పుడే ఈ కోడలు కూడా, ఈ మీ చోళసుందరి కూడా తెలుగు నేర్చుకుంది. ఇందాక నే చదివానే ఆ శివస్తోత్రం, ఇంతకూ నాకెవరు నేర్పారో చెప్పుకోండి చూద్దాం. మీరు పోల్చలేరు. నన్నయ్యభట్టారకులవారు రచించి స్వయంగా నాకు నేర్పారు."

రాజరాజు అప్రతిభుడై పోయినాడు. కళ్ళతోనే ఆమెనంతా హృదయంలో నిలుపుకున్నాడు. అంతఃపురంలో అయితే దోసిలొగ్గి తలవంచేవాడే లేదూ సంపెంగమాల మెళ్లోవేసి చెక్కిలి నొక్కేవాడు.

"అవునూ నన్నయ్యభట్టారకుల వారిచే నువ్వు రచన కూడా చేయించగలుగుతున్నావా?!"

"అవునుమరి. ఆయనకు అనుగ్రహం కలగాలి. దయ రావాలి."

"నాపైన కూడా అనుగ్రహం కలిగేట్లు చేయరాదా?"

అమ్మంగదేవి నాథుణ్ణి క్రీగంట చూసింది.

"కొడుకునుబట్టే కోడలిమీద అభిమానం ఎవరికైనాను! మా అత్తగారు కుందవాంబాదేవిగారు నేను పుట్టగానే తన సొత్తేనని అందరికీ చెప్పేసిందట!"

రాజరాజు ఏదో చెప్పబోతుండగా నన్నయ్యభట్టారకుల వారే అక్కడికి విచ్చేశారు.

"శెలవిప్పించండి మహారాజా!"

రాజరాజూ పట్టపుదేవీ ఇద్దరూ కలసి ఆయనకు పాదాభివందనం చేశారు.

"సుపుత్రావా ప్తిరస్తు."

రాజరాజనరేంద్రుడు పొంగిపోయినాడు. అమ్మదొంగా అన్నట్లు చూశాడు ఇల్లాలివైపు. అలసాలస విభ్రమ కటాక్షరోచులు బరపింది అమ్మంగదేవి నాథుడిపైన.

నన్నయ్యభట్టారకులవారు ముందు కడుగు వేస్తున్నారు.

"నాదొక మనవి."

ఏమిటన్నట్లు చూశారు భట్టారకులు.

"సతతమూ మనవి చేసుకుంటున్నదే."

"దానికేం, చూదాం."

"చూదామంటే కాదు. మహాదేవుని సమక్షంలో మీరు నాకు మాట ఇవ్వవలసిందే. తెలుగుదేశమంతా అల్లకల్లోలంగా ఉన్నది. నిన్నటివరకు ఎన్నో సంక్షోభాలతో విసిగి వేసారి ఉంది. మీకు తెలియని

ధర్మమేమున్నది? అటు తమిళంలో ఎంతో వాఙ్మయమున్నది. ప్రజ లంతా వాళ్ళ ప్రజాసాహిత్యాన్ని చదువుకొంటూ ఆనందిస్తారు. తిరు వాయి మొళి, తిరుప్పావులు చదువుకొని ఆనందిస్తారు వారు.

"తెలుగులో కావ్య సాహిత్యం, వాఙ్మయం ఏదీ?

"ప్రజలంతా దేశభాషలో ధర్మాధర్మ విచక్షణ జ్ఞానాన్ని ఎప్పుడు అలవరచుకొంటారు? ఇన్ని పండిత పరిషత్తులున్నాయి. మహా విద్వాంసు లున్నారు. ఎందుకు దేశభాషకీ అనాదరణ? ఉన్న ఎన్నో గ్రంథాలను మతకలహాలు రూపుమాపినవి కదా! మీరు గ్రంథ రచన చేపట్టక తప్పదు."

చిరునవ్వుతో ఆలకిస్తూనే ముందుకు కదిలారు భట్టారకులవారు.

అనుసరించారు రాజదంపతులు.

దేవాలయ ముఖమండపంలో కథాకాలక్షేపమేదో జరుగుతున్నది.

పౌరాణికులను పోల్చుకున్నారు రాజరాజు. నిన్న తన దర్శనం కోరి వచ్చిన మహాకవి ఆయన.

ఒక్క క్షణం నిలబడి పోయినారు నన్నయ్యభట్టారకులవారు. వేములవాడ భీమయ్యగారు భట్టారకులవారిని చూసి పీఠంమీది నుంచి దిగ్గున లేచివచ్చారు.

"నిన్నను తమ దర్శనమైందికాదు" అంటూ నన్నయ్యగారితో సల్లాపసౌఖ్యం అనుభవించారు భీమయ్యగారు. కైలాసగిరి శిఖరాల్లా ఉన్నారిద్దరునూ. గణనాథుడూ స్కందుడూ ఆలాప సల్లాపసౌఖ్యం చూపులతో అనుభవిస్తున్నట్లు ఒకరిపై ఒకరు ప్రీతి వీక్షణాలు బరపు కొంటున్నారు.

"ఏం ప్రవచనం చేస్తున్నారు?" అని అడిగారు భట్టారకులవారు.

"శివపురాణం."

"తాము తెలుగు చేశారా?"

"ఎబ్బే! ఎక్కడిది? సంస్కృతమే చదివి వినిపిస్తూ గాసటబీసట తెలుగులో చెపుతున్నాను. తెలుగులో రాయటం కష్టంకదా మహాకవీ! పండిత పరిషత్తుల వాదోపవాదాలన్నీ మీకు తెలీనివికావు. తెలుగా పొమ్మంటారు చట్టున ఈ పండితులు. దాంతో నాకు ఒళ్ళు మండుకొని వస్తుంది. వాళ్ళ కోసమే కొంత తిట్టు కవిత్వం మాత్రం చెప్పవలసి వచ్చింది. తెలుగులో ఇప్పటివరకు అది మాత్రమే చెప్పాను."

నన్నయ్యభట్టారకులవారు ప్రసన్న మధురంగా నవ్వారు.

"ప్రియము పలికినవారిని పెద్దమెత్తు రప్రియంబును పథ్యంబునైన పలుకు వినగనొల్లరు" అన్నారు.

"ఆహా! ఏమి సొగసుగా చెప్పారు మహానుభావా! మీరే ఆ పండితులను ఒప్పించాలి. మెప్పించాలి' అన్నారు భీమయ్యగారు.

పుచ్చపువ్వులాగా వెన్నెల.

అయినా మహారాజు చుట్టూ దివిటీలు ధగధగ కాంతులీనుతున్నాయి. 'మహాకవీ! మీ పద్యం ఒకటి వినాలని ఉంది. ఇటువైపు ఇంకో పది రోజులున్నా తమ దర్శనం అవుతుందోకాదో! విన్పించండి"

నన్నయ్య భట్టారకులవారు ప్రసన్నులైనారు.

రాజరాజు, అమ్మంగదేవీ మహద్భాగ్యం అనుకుంటూ చకిత ముగ్ధనేత్రాలతో నిలిచివున్నారు ఉత్కంఠతో ఎదురుచూస్తూ.

నన్నయ్య భట్టారకులవారు గొంతు విప్పారు ప్రసన్నంగా.

''రాజకులైక భూషణుడు రాజమనోహరు దన్యరాజతే
జోజయశాలి శౌర్యుడు విశుద్ధయశశ్శరదిందు చంద్రికా
రాజిత సర్వలోకు డపరాజిత భూరిభుజా కృపాణ ధా
రాజల శాంతశాత్రవ పరాగుడు రాజమహేంద్రుడున్నతిన్."

వేములవాడ భీమయ్యగారు చొక్కి పోయినారు.

అమ్మంగదేవి పరవశించింది. రాజరాజు ఉప్పొంగిపోయినాడు. దేవాలయ బహిర్ద్వారం దగ్గర పట్టపుటేనుగు 'మహారాజా! నేను సిద్ధం' అని ఘీంకారం చేస్తున్నది.

"విమలాదిత్య తనూజుడు విమల విచారుడు
కుమార విద్యాధరు డుత్తమచాళుక్యుడు''....అని నన్నయ్యగారు రాజరాజువైపు చూశారు.

దోసిలొగ్గాడు రాజరాజ నరేంద్రుడు. పరమవినీతుడై ఇట్లా విన్నవించుకున్నాడు: "స్వామీ, మహానుభావా, తండ్రీ! మీరే నాకు పంచాక్షరిని ఉపదేశించారు. మీరే నా గురువూ దైవమూ. మీరు నాపట్ల అనురక్తులు. మీరు అవిరళ జపహోమ తత్పరులు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతులు. నిత్యసత్యవచనులు. లోకజ్ఞులు. ఉభయ భాషాకావ్యరచనాభి శోభితులు, కాబట్టి...."

ఏమిటన్నట్లు ప్రీతిస్ఫితాక్షంగా సంప్రహృష్టంగా రాజరాజును కటాక్షించారు భట్టారకులవారు.

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమనీ, వేదాంతవిదులు వేదాంతమనీ, కవివృషభులు మహాకావ్యమనీ, నీతి విచక్షణులు నీతి శాస్త్రమనీ, ఇతిహాసకులు ఇతిహాసమనీ, పౌరాణికులు మహాపురాణమనీ భావించే మరో పంచాక్షరిని నాకు, నా తెలుగుదేశానికి తాము అనుగ్రహించాలి. దీన్ని తప్పక మీరు ఒప్పుకొని తీరాలి. ఈ మాట మీరు ఇవ్వకపోతే నేనూ నా ఇల్లాలూ మీపాదాలవద్ద ఇట్లానే ఉండిపోతాం. ఇక రాజప్రాసాదానికి వెళ్ళేది లేదు."

పట్టపుటేనుగు సాలంకృతమైన తొండం ఎత్తి, రండి రండి అని హర్ష ధ్వానం చేస్తున్నది. నన్నయ్య భట్టారకులవారు ఒక్కక్షణం నిమీలితేక్షణులైనారు. పరమ సంతోషం ఉట్టిపడే చూపులతో భీమయ్య గారి వైపు చూశారు. తరవాత రాజరాజు వైపు తిరిగి ఆ వెన్నెల వెలుగులో ఆ దీపలక్ష్మీకాంతిశోభాపరిపరిసుందర ప్రకృతిలో రాజరాజు ఒగ్గిన దోసిలివైపు చూస్తూ పెదవి విప్పారు: ''నమశ్శివాయ.''